క్లుప్తంగా

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

ముదినేపల్లి రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న పేరూరు చౌక ధరల దుకాణానికి డీలర్ల నియామకానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ పేర్కొన్నారు. గ్రామంలోని చౌక ధరల దుకాణానికి డీలర్ల నియామకానికి సంబంధించి నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై నోటిఫికేషన్ వెలువడిన నాటికి 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులకు 80 మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఫిబ్రవరి 9న పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఈ డీలర్‌షిప్‌ను ఓసీ, ఈడబ్ల్యూఎస్ కోటా వారికి మాత్రమే రిజర్వ్ చేసినట్లు తెలిపారు.

మినుము సాగుకు నీరందించాలి

ముదినేపల్లి రూరల్: మినుము పైరుకు సాగు నీరందించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అధికారులను కోరారు. మండలంలోని చిగురుకోటలో సాగు నీరు అందక మినుము పైరు దెబ్బతింటున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేయగా వీటిని ఎమ్మెల్సీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన దశలో పైరుకు నీరు అందకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. నీటి పారుదలశాఖ అధికారులు చర్యలు తీసుకుని సాగునీరు సక్రమంగా అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటోడ్రైవర్లు పోలీసులకు సహకరించాలని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు కోరారు. మండలంలోని బొమ్ములూరు సమీపంలో ఉన్న టిడ్కో సముదాయం వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటోడ్రైవర్లకు ఎస్‌ఐ శనివారం అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ఆటోడ్రైవర్లతో ఎస్‌ఐ ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా కూడార్రై ఉత్సవాలు

పామర్రు: ధనుర్మాసం 27 రోజులు పూర్తయిన సందర్భంగా పలు వైష్ణవ ఆలయాల్లో కూడార్రై ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక విష్ణాలయంలోని గోదాదేవి రంగనాథ స్వాముల సన్నిధిలో కూడార్రై ఉత్సవం సందర్భంగా తొలుత స్వామివార్లకు విశేషంగా పంచామృతాలతో అభిషేకాలను చేశారు. అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో ఆలయ అర్చకులు ముకుంద ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు వేణుగోపాల స్వామి, సుమతి, సుశీల, దేవి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. జమీదగ్గుమిల్లిలోని సీతారామాజంనేయస్వామి ఆలయంలో కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిమ్మకూరు వేంకటేశ్వరస్వామి ఆలయం, జమీగొల్వేపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కూడా కూడార్రై ఉత్సవాలను నిర్వహించారు.

కృష్ణాశ్రమంలో ..

పెదముత్తేవి(మొవ్వ): పెదముత్తేవి శ్రీ కృష్ణాశ్రమంలో కూడార్రై (పాయసాన్నం)ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ముముక్షు జనమహాపీఠాధిపతి ముత్తేవి గౌరకృష్ణ గురూజీ పర్యవేక్షణలో తయారు చేసిన ప్రత్యేక పాయసాన్ని నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు.



పామర్రు విష్ణాలయంలో నిర్వహించిన కూడార్రై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

జగన్నాథస్వామి ఆలయంలో..

ముదినేపల్లి రూరల్: వడాలి జగన్నాథస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం కుడార్రై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఫణికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రంగవల్లుల పోటీలు, సోమవారం గోదాశ్రీజగన్నాథస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.



పెదముత్తేవి కృష్ణాశ్రమంలో ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తున్న ముత్తేవి గౌరకృష్ణ గురూజీ

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కూడార్రై ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు విజయకుమార్ ఆచార్యులు, ఉగ్రనరశింహాచార్యులు గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కబడ్డీలో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వారు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీల్లో గుడ్లవల్లేరు ఏఏఎస్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించి తమ ప్రతిభను కనబరిచారు. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ శనివారం విలేకరులకు తెలిపారు. విజేతలతో పాటు పీడీలు వి.శ్రీనివాసరరావు, భవదీప్‌ను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ ఎన్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు అభినందించారు.



విజేతలతో ప్రిన్సిపాల్ రాజశేఖర్

శతవసంతాల 'తాడంకి బడి'

పమిడిముక్కల: పమిడిముక్కల మండలం తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ నెల 12న శతాబ్ది వేడుకలకు ముస్తాబైంది. పాఠశాల స్థాపించి 104 ఏళ్లు గడుస్తోంది. కరోనా విపత్కర పరిస్థితులు శతాబ్ది వేడుకలకు ఆటంకం కలిగించాయి. దీంతో ఈ ఏడాది జనవరి 12న శతాబ్ది వేడుకలను నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు పూనుకున్నారు. వందేళ్లకు గుర్తుగా పైలాన్‌ను తీర్చిదిద్దారు. దేశ, విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు వేడుకకు రానున్నారు.

వేడుకల సందడి ..

పమిడిముక్కల: మండలంలోని తాడంకి జెడ్పీ పాఠశాల్లో శతాబ్ది వేడుకల సందడి నెలకొంది. ఆదివారం నిర్వహించే శతాబ్ది వేడుకలకు ముందుగానే పూర్వ విద్యార్థులు పాఠశాలకు విచ్చేశారు.

శనివారం 1951–52 పదో తరగతి బ్యాచ్ నుంచి ఈ విద్యాసంవత్సరం వరకూ విద్యార్థులు ఆయా సంవత్సరాలతో కూడిన ప్లకార్డులు చేతపట్టుకుని పాఠశాల గేటు వద్ద నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి మార్చ్‌ఫాస్ట్‌నిర్వహిస్తూ అసెంబ్లీకి హాజరయ్యారు. శతాబ్ది వేడుకలకు గుర్తుగా 100 ఆకారంలో నిలబడి బెలూన్‌లను గాలిలోకి ఎగురవేసి కేరింతలు కొట్టారు.

రాజగోపాలస్వామి మందిరంలో సుదర్శన హోమం



కూచిపూడి(మొవ్వ): ధనుర్మాసం సందర్భంగా కూచిపూడి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాల స్వామి మందిరంలో సుదర్శన హోమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంతి ప్రధానాచార్యులు వేదాంతం వెంకటశివయ్య దంపతులు, నాట్య లెజెండ్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం దంపతులు పాల్గొన్నారు. హోమానికి వేద పండితులు వల్లభజోశ్యుల పవన్‌కుమార్ బృందం రుత్వికులుగా వ్యవహరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



గుడివాడ టౌన్: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్టేడియం క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించి బంగారు, వెండి పతకాలు సాధించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కార్యాలయంలో శనివారం అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో జరిగిన ఈ పోటీల్లో తమ క్రీడాకారులు ఈ పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి కె.రంగ ప్రసాదు పాల్గొన్నారు.

కార్మికులకు దుప్పట్ల పంపిణీ



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం కార్మికులకు బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ స్టేడియంలో శ్రమిస్తూ సేవలందిస్తున్న కార్మికులకు ప్రతి ఏటా ఈ సాయం చేయడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్ పాల్గొన్నారు.

పతంగులతో చిన్నారులు జాగ్రత్తగా ఉండాలి

తోట్లవల్లూరు: సంక్రాంతిని పురస్కరించుకుని పతంగులు ఎగురవేసే చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణానాయక్ పేర్కొన్నారు. విద్యుత్ వైర్లకు తగలకుండా నిర్మానుష్య ప్రదేశాల్లో చిన్నారులు పతంగులు ఎగురవేసుకోవాలని ఆయన సూచించారు.

పార్టీ పటిష్టతకు చిత్తశుద్ధితో పనిచేస్తా

కైకలూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని నూతనంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను శనివారం శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్‌తో కలిసి డీఎన్నార్‌ను సత్కరించారు. గుడిదేశి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని కేటాయించిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌ను సత్కరిస్తున్న గుడిదేశి, మామిళ్లపల్లి తదితరులు

జూదాలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

కైకలూరు: సంక్రాంతి సమయంలో యువత కోడి పందేలు, పేకాట వంటి జూదాలకు ఆకర్షితులు కాకుండా సంప్రదాయ క్రీడలు ఆడుకోవాలని పట్టణ ఎస్‌ఐలు డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీను పేర్కొన్నారు. కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం పోలీసుశాఖ నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటు ఉత్సాహంగా కొనసాగుతోంది. క్రీడలను తిలకించిన ఎస్‌ఐలు మాట్లాడుతూ పోలీసుశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో పలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నటరాజ్, శశి పాల్గొన్నారు.



కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో క్రీడాకారులతో ఎస్‌ఐలు

జూద శిబిరాన్ని అడ్డుకున్న అధికారులు

గుడివాడరూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని జూదాలు నిర్వహించేందుకు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేస్తున్న శిబిరాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని వలివర్తిపాడు పంచాయతీలోని బైపాస్‌రోడ్డు వద్ద కోడిపందేలు, పేకాట నిర్వహించేందుకు టెంట్లు ఏర్పాటు చేస్తున్నారనే సమాచారంతో అధికారులు ఆ ప్రాంతానికి చేరుకుని టెంట్లు తొలగించారు. అధికార పార్టీ నాయకులకు శనివారం నోటీసులు అందజేశారు. ఎస్‌ఐ చంటిబాబు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

జూదాలను అరికట్టేందుకు సహకరించాలి

మండవల్లి: కుటుంబాలను నాశనం చేస్తున్న జూదం, కోడి పందేలను అరికట్టేందుకు అందరి సహకారం అవసరమని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి అప్పారావు పేర్కొన్నారు. మండవల్లిలో శనివారం వారు మాట్లాడుతూ చట్టాలు అమలు చేయాల్సిన పలువురు, ప్రజాప్రతినిధులు, అధికారులు సంక్రాంతి పర్వదినాల్లో కోడి పందేలు, జూదాలను ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. కోడి పందేలను అరికట్టేందుకు పోలీసులు కృషి చేస్తున్నప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడికి వారు తలొగ్గుతున్నారన్నారు. జూదం, కోడి పందేలు ఇలాగే కొనసాగితే యువత పక్కదారి పట్టే అవకాశం ఉంటుందని తెలిపారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కైకలూరు: కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు సర్కిల్ సీఐ వి.రవికుమార్ హెచ్చరించారు. ఆయన ఆదేశాలతో కైకలూరు మండలం కొట్టాడ, ఆలపాడు, భుజబలపట్నం, చటాకాయి, కలిదిండి మండలం పోతుమర్రు, ఎస్ఆర్‌పీ అగ్రహారం, గుర్వాయిపాలెం, ముదినేపల్లి మండలం వడాలి, బొమ్మినంపాడు, కైకలూరు మండలంలో ఆటపాక గ్రామాల్లో బరులను శనివారం ధ్వంసం చేశారు. కైకలూరు మండలం కొల్లేరు గ్రామాల్లో తహసీల్దారు ఇబ్రహీం పర్యటించి కోడిపందేలను ప్రోత్సహించవద్దని గ్రామస్తులకు చెప్పారు. ఆయా మండలాల ఎస్‌ఐలు వి.రాంబాబు, డి.వెంకట్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, సీహెచ్.రామచంద్రరావు, వి.వేంకటేశ్వరరావు, ఎస్.వీర భద్రరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని గుడ్లవల్లేరు ఎస్‌ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం ఆయన గుడ్లవల్లేరు మండలంలోని వివిధ గ్రామాల్లోని జూదాలు నిర్వహించబోతున్న బరుల వద్దకు వెళ్లి ఏర్పాట్లను ధ్వంసం చేశారు. జూదాలను నిర్వహించబోమని నిర్వాహకుల నుంచి రాత పూర్వకంగా పత్రాలను రాయించుకున్నారు. తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ వి.విజయ సారథి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వీరగాథకు గౌతమ్ విద్యార్థిని

గుడివాడ టౌన్: విద్యార్థుల్లో ధైర్య సాహసాలు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన వీర గాథ 4.0 కు తమ విద్యార్థిని ఎంపికైనట్లు గౌతమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. పాఠశాల ఆవరణలో వీరగాథకు ఎంపికైన జి.శివ శరణ్యను శనివారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ పోయమ్ రైటింగ్, పారాగ్రాఫ్ రైటింగ్, డ్రాయింగ్, పెయింటింగ్‌లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇరువురు ఎంపిక కాగా వారిలో తమ విద్యార్థిని ఒకరని తెలిపారు. శివశరణ్యను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.



శివశరణ్యను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఫార్మసీ విద్యార్థినుల విజయకేతనం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీకి చెందిన విద్యార్థినులు చాంపియన్ షిప్‌ను సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ విషయాన్ని శనివారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 9, 10వ తేదీల్లో విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ మహిళా కళాశాల్లో నిర్వహించిన సాంస్కృతిక, క్రీడల పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారన్నారు. చెస్‌లో పి.అనూష, షటిల్ డబుల్స్‌లో ఎస్.సాయి శృతి బృందం, ఖోఖోలో ఎస్.జయశ్రీ బృందం, కబడ్డీలో ఎం.నాగజ్యోతి బృందం ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. సాంస్కృతిక పోటీల్లో వై.ప్రణీత ప్రథమ స్థానం, ఎం.నాగ హరిప్రియ ద్వితీయ స్థానం, నృత్య ప్రదర్శనల్లో జె.కాంక్ష ద్వితీయ స్థానాల్లో నిలిచి చాంపియన్ షిప్‌ను సాధించారని తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు నగదు బహుమతులను అందించారని పేర్కొన్నారు.



చాంపియన్ షిప్‌ను సాధించిన గుడ్లవల్లేరు ఫార్మసీ విద్యార్థినులు

సంప్రదాయాలను ప్రోత్సహించడం అభినందనీయం

పెదమద్దాలి(పామర్రు): సంక్రాంతిని పురస్కరించుకుని సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించడం కోసం రైతు బిడ్డ డొక్కు కోటయ్య, సుబ్రమణ్యేశ్వర అభినందన ట్రస్టు చేస్తున్న కృషి అభినందనీయమని భారత వైమానిక సంస్థ రిటైర్డు అధికారి వీవీ రావు పేర్కొన్నారు. మండలంలోని పెదమద్దాలిలో ఉద్దండ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో గ్రామస్తులకు రంగ వల్లులు తదితర పోటీలను శనివారం నిర్వహించారు. అనంతరం పదో తరగతిలో మండల ప్రథమ స్థానం సాధించిన మేడిశెట్టి విజయమోనికకు రూ.21,160, రోలింగ్ షీల్డునుఅందజేశారు. ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు, మానవత సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను గౌరవించాలి

నిభానుపూడి(పామర్రు): మన సంప్రదాయాలను కాపాడుతూ ఊరూర తిరుగుతున్న గంగిరెద్దు వారిని గౌరవించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిభానుపూడిలో గంగిరెద్దుల వారిని శనివారం సన్మానించారు.



నిభానుపూడిలో గంగిరెద్దుల వారిని సన్మానించిన ఎంపీపీ అశోక్‌కుమార్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

గుడ్లవల్లేరు: కౌతవరంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చాగంటిపాటి సత్యనారాయణకు చెందిన పూరిల్లు శనివారం దగ్ధమైంది. రూ.4 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. వెంటనే ఆ బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మండల మహిళా అధ్యక్షురాలు పడమటి సుజాత పరామర్శించారు. తన వంతుగా ఒక కట్ట బియ్యాన్ని అందించి చేయూతనిచ్చారు. అలాగే రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్, జిల్లా కన్వీనర్ హరికృష్ణ బాధితులకు వంట పాత్రలు, దుప్పట్లు, నిత్యావసరాలను అందించారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఈడె లక్ష్మి, నాయకులు పడమటి నాంచారయ్య, ప్రసాద్, బాషా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి రూ.20వేల సాయం

గుడ్లవల్లేరు: మచిలీపట్నానికి చెందిన పేద విద్యార్థిని పెదప్రోలు మేఘన గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో ఎంబీఏ సెకండియర్ చదువుతోంది. ఆమెకు బాడిగ శేషగిరిరావు, రామాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మాజీ ఎంపీ బాడిగ రామకృష్ణ రూ.20వేల సాయం చేశారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్‌బ్యాంక్ చైర్మన్ బాబ్జి, కొండలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ భాస్కరరావు చేతుల మీదుగా అందజేశారు.

గోకులం షెడ్డు ప్రారంభం

నందివాడ: మండలంలోని చిన లింగాల గ్రామంలో మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక రైతులతో కలిసి గోకులం షెడ్డులో ఎమ్మెల్యే రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణుప్రసాద్, ఏపీఓ దేవానంద్‌రాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

33కేవీ విద్యుత్ లైను ఏర్పాటు

గుడ్లవల్లేరు: మండలంలో అంగలూరు, గుడ్లవల్లేరు, కౌతవరం మీదుగా వెళ్లే 33 కేవీ విద్యుత్ లైను ఆ ప్రాంతాలకే వరంగా మారింది. ఈ విద్యుత్ లైనును శనివారం ఏర్పాటు చేశారు. రీ వేంపెడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ కేంద్ర ప్రభుత్వ పథకం కింద ఈ లైనును ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ వరకుమార్ తెలిపారు.



వ్యాపార రంగంలో ప్రగతి

విద్యా, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న గుడివాడ

గుడివాడరూరల్: గుడివాడ పట్టణం వ్యాపార రంగంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోంది. మచిలీపట్నం–ఏలూరు జిల్లాలకు కూడలిగా ఉన్న గుడివాడ విద్య, వైద్యం, వ్యాపారం, వాణిజ్య రంగాలకు కేంద్రంగా మారింది. విద్య ద్వారా గుడివాడ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఆధునిక వ్యవసాయ పరికరాలు తయారు చేయడంలో రాష్ట్ర వ్యాప్తంగా గుడివాడ గుర్తింపు తెచ్చుకుంది. అదే విధంగా ఆక్వా రంగం గుడివాడ పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి చెందడంతో పలువురికి ఉపాధి లభిస్తోంది.

వైద్య రంగానికి ప్రత్యేక గుర్తింపు

పట్టణంలో వైద్య రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. సూపర్‌స్పెషాల్టీ, స్పెషాల్టీ, మల్టీస్పెషాల్టీ, కార్పొరేట్ ఆస్పత్రులు గుడివాడకు రావడం వల్ల వైద్యం కోసం విజయవాడ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. అన్నపూర్ణ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి, సాయి శ్రీయాన్ కిడ్నీ ఆస్పత్రి, గణేష్ హాస్పిటల్, ఆర్కా హాస్పిటల్స్, పిల్లల విభాగంలో నవ్యసాయి, దంత సేవల్లో శ్రీసాయి డెంటల్ ఆస్పత్రుల్లో పట్టణంలో ప్రజలకు సేవలందిస్తున్నాయి. గుడివాడలోనే దంత, కంటి, ఆర్థోపెటిక్, పీడీయాట్రిక్, గుండె, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, చర్మవ్యాధులు వంటి సేవలతో పాటు స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అందుబాటులోకి వచ్చాయి.

ప్రముఖ వస్త్ర దుకాణాల ఏర్పాటు

మహానగరాల్లో ఉన్న పెద్ద వస్త్రదుకాణాలు వాటి షోరూమ్‌లను గుడివాడలో ఏర్పాటు చేశారు. సీఎంఆర్, ఎస్‌వీఆర్, పీటర్ ఇంగ్లాండ్, ఆలెన్‌సోలే, వైట్‌హౌస్ పేరెన్నికగల వస్త్రాలు లభించే దుకాణాలను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి సోనోవిజన్, రియల్స్ డిజిటల్ మార్ట్, శ్యాంసంగ్ ప్లాజా, బజాజ్ ఎలక్ట్రానిక్స్ కూడా ఉన్నాయి. రిటైల్ మార్కెట్‌లో కూడా డీమార్ట్, మోర్ సూపర్ మార్కెట్, ఉషోదయ, స్మార్ట్ సూపర్ మార్కెట్లు ఇక్కడ వ్యాపారాన్ని కొనసాగించడంతో వేరే ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలోనే తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయి.



గుడివాడ నెహ్రూచౌక్ కూడలి



ఎన్టీఆర్ స్టేడియం వద్ద వ్యాపార సముదాయాలు

విద్యా రంగంలో అగ్రగామి

గుడివాడలో ఉన్న డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్, విశ్వభారతి, వైజ్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్‌తో పాటు విద్యాలయ, ఉషోదయ స్కూల్స్, వీకేఆర్ వీఎన్‌బీ అండ్ ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఏఎన్ఆర్, కేటీఆర్ మహిళా కళాశాలలు స్థానికంగా ఉత్తమ విద్యను అందిస్తూ రాష్ట్రవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నాయి. గుడివాడలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు సాంకేతిక విద్యాలయాలు ఏర్పాటుతో సీబీఎస్ఈ, ఇంగ్లిష్ మీడియం, పీజీ, పాలిటెక్నిక్, కంప్యూటర్, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి.

మంచి నడవడికను అలవాటు చేస్తున్నాం



గుడివాడ పట్టణంలో ఉన్నత స్థాయి విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయి. సీబీఎస్ఈ, కంప్యూటర్, ఇంజినీరింగ్ కోర్సులు కూడా స్థానికంగానే ఉన్నాయి. మా సంస్థలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు ఎప్పటికప్పుడు క్రమశిక్షణతో మంచి నడవడికను అలవాటు చేస్తున్నాం. అది వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతుంది.

– బొప్పన విజయభాస్కర్, విద్యాలయ స్కూల్ డైరెక్టర్